# సీత జోస్యం



నార్ల వెంకటేశ్వరరావు

# రామాయణంలో నిజ మెంత?

**రా**మాయణగాథకు చారిత్రకాధారం ఏ కొంచెంగానైనా వున్నదా? – ఈ ప్రశ్న వేయడమే కోటానుకోట్ల రామభక్తుల దృష్టిలో ఒక పెద్ద నేరం, ఒక ఘోర పాపం. ఈ ప్రశ్న వేసే వాని నాల్క చీల్చాలి, గొంతు నులమాలి, అతడిని నిలువునా పాతిపెట్టాలి. రామాయణం నిజం కాకపోతే, ఏది నిజం? ఎంత దూరమో పోవడం దేనికి? ఒక కుటీరాన్ని వేసుకుని, కొంత కాలం పాటు మన భద్రాచలం సమీపాన సీతారామలక్ష్మణులు వనవాసం చేసినందునే ఆ ప్రాంతాన్ని ఈనాటికీ "పర్ణశాల" అంటున్నారు. దాని వద్ద సీత ఋతుస్నానాలు చేసిన ఉష్ణ గుండాలు ఈనాటికీ వున్నాయి. బట్టలు ఉతుకుకొనడానికై ఆమె వాడిన రాతిబండలను ఇప్పటికీ అక్కడ చూడవచ్చు. ఆమె అపహరణవార్తను గుంటూరుజిల్లాలోని ఒక కొండవద్ద మొట్టమొదటగా రాముడు విన్నందునే దానికి "వినుకొండ" అనే పేరు వచ్చింది. పాషండులు ఏమన్నా, రావణాసురుని కాష్ఠ మిప్పటికీ భగభగ మండుతూనే వున్నది. ఇప్పుడు లంకను శ్రీమతి సిరిమావో బండారునాయకే పరిపాలిస్తున్నా, విభీషణుడు ఆ దీవిలోనే ఎక్కడో ఒకచోట ప్రసన్నంగా కూర్చుని ఈనాటికీ రామభజన చేస్తూనే వున్నాడు. ఆయనవలె హనుమంతుడు సయితం చిరంజీవి. నాస్తికుల పాపిష్ఠి కళ్ళకు ఆయన కనబడకపోవచ్చుగాని, "శ్రీఆంజనేయం, ప్రసన్నాంజనేయం, ప్రభాదివ్యకాయం, ప్రకీర్తిప్రదాయం, భజే వాయుపుత్రం, భజే వాలగాత్రం, భజేహం!" అంటూ ప్రార్థించినంతనే భక్తుల రక్షణకై ఈనాటికీ ఆయన ఒక గంతులో వచ్చి, భూత ప్రేత పిశాచాలను చీల్చి చెండాడుతున్నాడు.

పాషండులు, ఇతర నాస్తికులు నమ్మకపోయినా, రామజననం దాదాపు పది లక్షల సంవత్సరాల క్రితం జరిగింది. మరింత కచ్చితంగా చెప్పాలంటే, క్రీస్తుకు పూర్వం

8,67,102 సంవత్సరాల నాడు త్రేతాయుగంలో జరిగింది. రామాయణంలోనే ఒకచోట (ఉత్తర కాండలో 74వ సర్గ) రామజననం త్రేతలో కాదని, ద్వాపరంలో అని వున్నదనుకోండి. రావణ వధానంతరం పరమేశ్వరుని వెంట రాముని వద్దకు వచ్చిన దశరథుడు "కాహళుడను బ్రాహ్మణుని అష్టావక్రుడు తరింపజేసినట్టు నీవు నా వాక్య పరిపాలనద్వారా నన్ను తరింపజేశావు" అని అష్టావక్రుని ప్రసక్తి తెచ్చినట్టు యుద్ధకాండలో (122వ సర్గ) వున్నందున రాముడు కలియుగ ప్రారంభానికి చెందినవాడని తీర్మానించు కోవాలనుకోండి.[1] అయితే, ఇవి పొరపాటు మాటలు. రామునికి, రామాయణానికి సంబంధించినంత వరకు ఎంత వెనకకు వెడితే, నిజానికి అంత చేరువగా మనం జరుగుతాము! తిరుగులేని ఈ సూత్రాన్ని పాటించే ఒక జ్యోతిషశాస్త్ర పండితుడు రామరావణయుద్ధం క్రీస్తుకు పూర్వం 1,25,67,101వ సంవత్సరంలో జరిగిందని చెప్పాడు. ఒక విధంగా ఇది కూడా తగినంతగా వెనుకకు వెళ్ళడం కాదు. ఈ భూమి పుట్టినప్పుడే, ఆ మాటకు వస్తే, ఈ భూమి పుట్టక ముందే, వేదాలున్నాయి. వాటిలో ఇక్ష్వాకుని పేరు వున్నది. సీతారామలక్ష్మణుల పేర్లు వున్నాయి. వేదాంగాలైన బ్రాహ్మణాలలో, ఉపనిషత్తులలో విదేహరాజు జనకుని పేరు వున్నది. కేకయరాజు అశ్వపతి పేరు వున్నది.

ఈ ధోరణిలో రామభక్తులు ఏమేమో చెబుతూ పోతారు. అంతూపొంతూ లేకుండా చెబుతూ పోతారు. వారి మాటలకు విలువ యిస్తే, రావణునికి పది తలలని, ఇరవై చేతులని నమ్మవలసి వస్తుంది; హనుమంతునికి తోకవున్నట్టు, అతడు నూరు యోజనాల సముద్రాన్ని (బహుశా తన తోక తోడ్పాటుతోనే) అవలీలగా లంఘించి, లంకను తగలబెట్టి వచ్చినట్టు నమ్మవలసి వస్తుంది; కుంభకర్ణుని నిద్రనుంచి మేల్కొలపడానికి అతడిని వెయ్యి యేనుగులతో రావణుడు తొక్కించినట్టు నమ్మవలసివస్తుంది; రామాయణంలో కోకొల్లలుగా వున్న ఇట్టి కాకమ్మ కథలన్నింటిని కడిగిపోసిన సత్యాలుగా గుర్తించవలసి వస్తుంది. అందువల్ల రామయణాని కున్న చారిత్రక ప్రాతిపదిక విషయమై జరిపే చర్చ సందర్భంలో రామభక్తులను మన దరిదాపులకైనా చేరనీయరాదు. వారిని, వారి సోదెను ఎంతమాత్రం పట్టించుకోరాదు.

కట్టుకథకు, గట్టి చరిత్రకు భేదం తెలియని రామభక్తులను ఒక పక్కకు నెట్టి, వేదాలను చారిత్రక దృష్టితో పరిశీలిస్తే, వాటిలోని ఇక్ష్వాకునికి, రామాయణంలోని ఇక్ష్వాకునికి ఏమీ సంబంధం లేదని తెలుస్తుంది. ఋగ్వేదంలో ఒకసారి, అధర్వణవేదంలో ఒకసారి, మొత్తం రెండు సార్లు వేదాలలో ఇక్ష్వాకుని ప్రసక్తి వున్నది. అయితే, ఇతడు వైవస్వత మనువు కుమారుడు కాదు, రాముని వంశానికి మూల పురుషుడు కాడు. పోతే, ఋగ్వేదంలోని సీత నాగేటిచాలు గాని, రామాయణ నాయిక కాదు. ఋగ్వేదంలోనే ఒక ఋక్కులో

# ఏది జనస్థానం? ఎక్కడిది లంక?

**ఆ**లోచన చేయగల వారిని రామాయణం జాగ్రఫీ ఎంతగానైనా తికమక పెడుతుంది. దానిలోని ఇతర వికారాలు పెక్కింటికివలె ఇందుకు కూడా మూలకారణం దానిలో ప్రక్షిప్తాలే అని చెప్పవచ్చు. వనవాసానికి అయోధ్యలో బయల్దేరిన రాముడు సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమానికి చేరుకొనడానికి ఏయే దారులవెంట, ఏయే దిక్కులలో పయనించాడో, ఏయే నదీనదాలను, ఏయే పర్వతాలను, లోయలను దాటినాడో, మార్గమధ్యంలో ఎక్కడెక్కడ, ఎంత కాలం పాటు విశ్రమించాడో ఈ వివరాలలో దొసగులు లేవు. ఉత్తర, వాయవ్య, ఈశాన్య భారతాలకు సంబంధించిన భౌగోళిక వివరాలు సయితం మొత్తంపై సవ్యంగానే వున్నాయి. అయినప్పుడు దక్షిణ భారతం వద్దకు వచ్చేసరికి తప్పులు విశేషంగా దొర్లడం ఎందువల్ల జరిగింది? వాల్మీకి రచనకు "మెరుగులు" దిద్దిన ప్రబుద్ధులే ఇందుకు బాధ్యులను కొనడానికి బలీయమైన కారణాలు కొన్ని వున్నాయి. దక్షిణ భారతం ముక్కుముఖాలైనా వారికి సరిగా తెలియవు. అయినా, సర్వం తెలిసినట్టు వారు వాల్మీకి రచనలో వేలు పెట్టారు. వారి కారణంగా మరీ హెచ్చుగా తప్పులు దొర్లింది. కిష్కింధా కాండలోని 40, 41, 42, 43 సర్గలలో. రామాయణాన్ని విమర్శక దృష్టితో పరిశీలించిన పండితులందరు ఇవి ప్రక్షిప్తాలని నిర్ణయించారు. భూలోకాన్ని గురించి మాత్రమే కాక, నాగలోకాన్ని గురించి, నరకలోకాన్ని గురించి, ఆదిశేషుని గురించి, ఉదయాద్రి, అస్తాద్రులను గురించి సుగ్రీవుని చేత వీటిలో ఉపన్యాసం చెప్పించడం జరిగింది కనుక, వీటిని "సుగ్రీవుని జాగ్రఫీ సర్గ" లనవచ్చు.

ఒక ముఖ్య విషయాన్ని ఇక్కడ మనం గమనించాలి. సీతను చెరబట్టిన రావణుడు దక్షిణంగా వెళ్ళినట్టు రామలక్ష్మణులకు జటాయువు స్పష్టంగా చెప్పాడు. (అరణ్యకాండ,

68వ సర్గ). అందువల్లనే వారిద్దరు సీతాన్వేషణకై దక్షిణాభిముఖంగా వెళ్ళారు. అదే దిశలో గల ఋశ్యమూకను దాటి రావణుడు వెళ్ళడాన్ని తాను చూచినట్టు సుగ్రీవుడు స్వయంగా రామునితో చెప్పాడు. అయినా, సీతాన్వేషణకై తక్కిన మూడు దిక్కులకు కూడా సుగ్రీవుడు తన వానర బలగాలను ఎందుకు పంపించాలి? అది కేవలం మతిలేని పని కాబట్టి, దాన్ని అతడు చేయలేదనే మనం అనుకోవాలి. కాని, వాల్మీకికి "మెరుగులు" దిద్దినవారికి తమ భూలోక పరిజ్ఞానాన్ని ప్రదర్శించు కొనడానికి ఒక సాకు కావాలి. అది ఈ పట్టులో దొరకనే దొరికింది కాబట్టి, దాన్ని వారు పూర్తిగా వినియోగించుకొన్నారు.

ఏమైనా, సుగ్రీవుని జాగ్రఫీ ప్రకారం భూమి గుండ్రంగా లేదు, చదునుగా వున్నది, బొంగరం వలె శూన్యంలో అది గిరగిర తిరగడం లేదు, ఆదిశేషుని శిరస్సుపై స్థిరంగా నిలిచివున్నది. తూర్పు దిక్కుగా మనం పయనిస్తూ పోగా పోగా, బయల్దేరిన చోటుకే మనం తిరిగి రాము, ఇలాతలం తూర్పు పొలిమేరను చేరుకొంటాము. ఆ పొలిమేరలో గల పసిడికొండపై తాపీగా కూర్చుని, ఆదిశేషుడు భూభారాన్ని మోస్తూ వుంటాడు. (మరి ఆ పసిడి కొండ దేనిపై బైఠాయించిందో!) పసిడికొండ నడినెత్తిని ఒక పసిడి తాడిచెట్టు వున్నది. దానివి మూడు తలలు. (దాన్ని అక్కడ పాతింది ఇది తూర్పు పొలిమేర అని చెప్పడం కోసమట; దాన్ని పాతిన వారు బ్రహ్మ విష్ణు మహేశ్వరులట) ఆ తాటిచెట్టు వరకు వెళ్ళేలోగా మనం సగం పులిరూపంలో వున్న నరులను చూస్తాము; ఒంటికాలితో నడిచేవారిని, పెదవులలో చెవులున్నవారిని, ఉక్కుకంటే గట్టి ముఖాలున్న వారిని చూస్తాము. పర్వత శిఖరాల నుంచి తలక్రిందులుగా వ్రేలాడుతున్న రాక్షసులను చూస్తాము. (ఆ రాక్షసుల పేరు "మందేహులు". ప్రతిదినం అరుణోదయవేళ భూసురోత్తములు జపిస్తున్న గాయత్రీమంత్ర ప్రభావంవల్ల మందేహులు సముద్రంలో పడిపోతూ వుండబట్టి మనం బ్రతికిపోతున్నామట; లేకపోతే, వారినుంచి మనకు ఘోర ప్రమాదాలు తప్పేవి కావట.) పోతే, ఈ తూర్పు దిశలోనే మనం ఇక్షు, లవణ, లోహిత, శుద్ధజల, క్షీర సాగరాలను చూస్తాము. క్షీరసాగరంలో జలక్రీడ లాడుతున్న యక్ష గంధర్వ చారణాప్సరాది లావణ్యవతులను చూస్తాము.

తూర్పు దిక్కులోవలె తక్కిన మూడు దిక్కులలో సయితం ఇంతటి వింతలను, ఇంతకు మించిన విడ్డూరాలను మనం చూడవచ్చు. ఉదాహరణకు, దక్షిణాన ఒక వెండి కొనతో, ఒక బంగారం కొనతో పెద్ద కొండ వున్నది. పశ్చిమాన రెక్కలున్న సింహాలున్నాయి. ఉత్తరాన రంగు రంగుల బట్టలను కాసే చెట్లు, ముత్యాల, వజ్రాల నగలను కాసే చెట్లు, బంగారు పాన్పులను కాసే చెట్లు వున్నాయి! సుగ్రీవుని పేర ఈ జాగ్రఫీని సృష్టించిన ప్రబుద్ధులను "ఈ వింతలు, ఈ విడ్డూరాలు మా కంటికి కనబడ వేమి?" అని ప్రశ్నించే

# రాక్షసు లెవరు?

**ఋ**గ్వేదంలో, అధర్వవేదంలో, మరికొన్ని వైదిక గ్రంథాలలో రాక్షసుల ప్రసక్తి విశేషంగా వున్నది. దీన్ని అవినాశచంద్ర దాస్ "ఋగ్వేదిక్ కల్చర్"[1] అనే గ్రంథంలో క్రోడీకరించారు. ఆయన క్రోడీకరణ ప్రకారం, రాక్షసులు కుక్కల, రాబందుల, గుడ్లగూబల ఆకృతులలో వుంటారు. ఒక చోటునుంచి మరొక చోటుకు పిట్టల వలె వారు ఎగిరిపోతూ వుంటారు. సోదరునిరూపం, భర్త రూపం, ప్రియుని రూపం ధరించి స్త్రీలను సమీపించి, వారి సంతానాన్ని రాక్షసులు నాశనం చేస్తూ వుంటారు. కపిరూపంలో, లేదా శునకరూపంలో స్త్రీలకై వారు పొంచి వుండడం కద్దు. గర్భవతులై వున్నప్పుడు, ప్రసవ సమయంలో స్త్రీలకు మరింత ప్రమాదకరంగా వారు పరిణ మిస్తారు. పశుపక్ష్యాదుల రూపాలను అప్పుడప్పుడు ధరించినా, మానవాకృతిలోనే వారు అధికంగా వుంటారు. అయితే, ఏదో ఒక వైకల్యం తప్పదు, వికారం తప్పదు, వైపరీత్యం తప్పదు. వారిలో కొందరికి మూడు తలలు, కొందరికి రెండు నోళ్ళు, కొందరికి నాలుగు కళ్ళు, కొందరికి ఎలుగుగొడ్డు మెడ, కొందరికి అయిదు కాళ్ళు, కొందరికి చేతులపై కొమ్ములు! యజ్ఞయాగాదులను రాక్షసులు ధ్వంసం చేస్తారు; దుర్భాషలకు, దుశ్చర్యలకు వారికి పెట్టింది పేరు. ఆవు పొదుగు నుంచి పాలను దొంగచాటుగా వారు తాగి వేస్తారు, పచ్చి మాంసం తింటారు. నరమాంసాన్ని మరింత పసందు చేస్తారు. నరులను చంపి తినడానికై వారిలో ప్రవేశిస్తారు. ఒక్క అగ్ని దేవుడంటేనే రాక్షసులకు చెడ్డ భయం. రాక్షసుల పీడ తప్పించడానికై అగ్నిదేవునికి చాలిన వాడు మరి లేదు.

రాక్షసులకు జ్ఞాతులుగా చెప్పదగు వారు పిశాచులు. వారు శవాలను తింటారు. ఋగ్వేదంలో పిశాచుల ప్రసక్తి ఒకే ఒక చోట వున్నా, అధర్వవేదంలో, తైత్తిరీయ సంహితలో

వారు హెచ్చుగా తారసిల్లుతారు. రాక్షసులకు వలె పిశాచులకు “క్రవ్యాదులు” పర్యాయపదం కావడం ఉభయవర్గాల వారికి నరమాంసం పట్ల గల ప్రీతివల్లనే.

“అసురు” లనే వారు రాక్షసులకు, పిశాచులకు అన్నలవంటివారు. అసురులకు వైరం దేవతలతో, రాక్షసులకు విరోధం నరులతో, పిశాచులకు వైమనస్యం పితరులతో, వీరి నుంచి పీడతొలగించడానికే శవాలను దహనం చేయడం. పైగా, మృతదేహాన్ని దహించివేస్తే, చెఱనుంచి బయట పడిన తీరులో, ఆత్మ పుణ్యలోకాలకు సునాయాసంగా చేరుకోగలుగుతుంది! అన్నెం పున్నెం తెలియనివారు కాబట్టి, శిశువుల మృతదేహాలను చితిపై పెట్టనక్కరలేదు; అరిషడ్వర్గాలను జయించినవారు కాబట్టి, సర్వసంగ పరిత్యాగులకు సయితం దహన సంస్కారంతో నిమిత్తం లేదు.

రాక్షసులకు, పిశాచులకు జ్ఞాతులస్థానానికి అసురులను దిగదీయడానికి ముందు మిత్ర, వరుణులను అసురులుగా ఆర్యులు ప్రశంసించారు. ఈ దేవత లిద్దరిని ఏకం చేసి, “మిత్ర–వరుణ” అనే పేరుతో కొన్ని చోట్ల సంస్తవించారు. ‘అసుర” అనే పదాన్ని దుష్టార్థంలో ఋగ్వేదంలో ప్రయోగించింది (రమేశ్ చంద్రదత్ వివరించినట్టు[2]) దాని చిట్టచివరి మండలంలోనే. ఆర్యులలో ఇండియాకు చేరిన శాఖవారికి “అసుర” శబ్దం దుష్టమైనదిగా మారిపోయిన తర్వాత కూడా ఇరాన్‌లో స్థిరపడిన శాఖ వారికి “అహుర” అనే పేరుతో అసురుడు దేవాధి దేవుడుగానే నిలిచాడు.[3] (ఇరానియన్ దేశస్థులు “స”ను “హ”గా పలుకుతారు. తమకు తెలిసిన భారతదేశాన్ని – సప్త సింధు ప్రాంతాన్ని వారు “హప్త హిందు” అనేవారు. “ఇండియా” అనే మాట ఆ “హప్త హిందు” నుంచి వచ్చినట్టిదే) అనంతప్రసాద్ బెనర్జీ శాస్త్రి వాదాన్ని ఆమోదిస్తున్నవారు ప్రస్తుతం దాదాపుగా లేరు గాని, దాని ప్రకారం ఇండియాకు తొలిగా వలసవచ్చిన ఆర్యులు తమ వరుణ దేవుని చలవతో సముద్రమార్గం వెంట వచ్చారు; వారు వచ్చింది అసీరియా నుంచి కాబట్టి, వారికి “అసురు” లనే పేరు వచ్చింది; వారు నిర్మించిన అసురనాగరికతే హరప్ప, మొహెంజొ దారోలు ప్రధాన కేంద్రాలుగా సింధులోయలో పరిఢవిల్లింది. ఆయన చేసిన ఈ వాదం పట్ల ఆసక్తి గల వారు “అసుర ఇండియా”[4] అనే పేరుతో ఆయన వ్రాసిన గ్రంథాన్ని చదవవచ్చు.

అసురులు ఆర్యజాతికి చెందిన ఒక శాఖవా రైనప్పటికీ, రాక్షసులు మాత్రం నిశ్చలంగా ఏదో ఒక జాతికి, లేదా దాని శాఖకు చెందిన ప్రజలు ఎంత మాత్రం కారు. ఇదే మాట పిశాచులకు వర్తిస్తుంది.[5] పరజాతుల వారి పట్ల ఆర్యుల వైరవిద్వేషాల నుంచి, వారి భయవిభ్రాంతుల నుంచి పుట్టుకు వచ్చిన వారే రాక్షసులైనా, పిశాచులైనా, వేదకాలం నాటి ఆర్యులు అంతకు పూర్వమే ఇక్కడ స్థిరపడిన వివిధ జాతులవారితో హోరాహోరీగా

# ఋషు లెవరు ?

నిజమే – ఒక లోకోక్తి హెచ్చరిస్తున్నట్టు, ఋషిమూలాన్ని విచారించరాదు. ఆ పని చేస్తే, కనబడేది ఏదో బూతు, లేదా ఏదో బొంకు! ఈ రెండింటిలో ఒకటి కాకపోతే, కనీసం దంభం కనబడుతుంది, లేదా దర్పం కనబడుతుంది! ఒక్క మనదేశంలోనే కాదు, అన్ని దేశాలలో – ఒక్క మన నాగరికతలోనే కాదు, అన్ని నాగరికతలలో – మంత్రవేత్తలుగా చెల్లిన వారి విషయంలో. చెల్లుతున్న వారి విషయంలో నా మాటలు నూటికి నూరు పాళ్ళు నిజం.

మంత్రాలకు చింతకాయలు రాలనిది ఇప్పుడే కాదు, ఎప్పుడైనా, ఎక్కడైనా కాని, అవి రాలతాయన్న నమ్మకాన్ని ప్రజలలో పాదుకొలపకపోతే, మంత్రవేత్తలకు ఆధిక్యత దక్కదు సరిగదా, అన్నపానీయాలైనా దక్కవు. అందువల్ల ఎన్నెన్నో వేషాలు వారు వేయాలి, మోసాలు చేయాలి, గొప్పలు చెప్పుకోవాలి, ఘనతలు ఆపాదించుకోవాలి.

అయితే, ఇదే సమయంలో ఒక సత్యాన్ని నేను గుర్తిస్తాను. దేశదేశాల నాగరికతల చరిత్రలను చదివిన నేను దాన్ని గుర్తించకపోతే, అది క్షమించరాని తప్పిదమే కాగలదు. ఈనాడు మనం డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ఎస్ట్రానమర్స్‌గా (ఖగోళ శాస్త్రజ్ఞులుగా), ఇతర సైన్‌టిస్టులుగా చెప్పుకొంటున్న వారు ఒకనాడు మంత్రవేత్తలే. మానవ చరిత్రలో పశు పోషణ వ్యవస్థ, వ్యావసాయిక వ్యవస్థ ఒకదాని తర్వాత మరొకటి నెలకొన్నంతనే, విద్యా వైజ్ఞానిక విషయాలను గురించి ఆలోచనలు చేయడానికి, పరిశోధనలు జరపడానికి కొందరికి విరామం లభించింది. వీరిలో అధిక మేధావులైనవారే దేవతలకు పూజారులైనారు, రాజులకు పురోహితులైనారు, అగ్రవర్ణాల లేదా వర్గాల పౌరులకు విద్యాగురువులైనారు. వీరే మనకు తొలి సైన్‌టిస్టులు. నిప్పును రగల్చడం మొదలుకొని కుండను చెయ్యడం

వరకు; కుక్కను, ఆవును, గుఱ్ఱాన్ని మచ్చికచేయడం మొదలుకొని నాగలిని కనిపెట్టడం వరకు; ఎప్పుడు వరద పొడవగలదో చెప్పడం మొదలుకొని, ఎప్పుడు గ్రహణం వదలగలదో సూచించడం వరకు – అన్నీ ఒకనాడు విప్లవాత్మకమైన వైజ్ఞానిక, సాంకేతిక విజయాలే. వీటిని దాదాపు పూర్తిగా సాధించినవారు దేవతల పూజారులే, రాజుల పురోహితులే. అగ్రవర్ణాల, లేదా వర్గాల విద్యాగురువులే. అయితే, ప్రజాబాహుళ్యానికి సంబంధించినంత వరకు తమకు తెలిసిన విద్యలను వీరు గుప్తంగా వుంచారు. తమ ప్రధాన పోషకులకు సయితం తమకు తెలిసిన సమస్తాన్నీ విడమర్చి చెప్పలేదు. దీనికితోడు వీరు తమకు సర్వజ్ఞతను ఆపాదించుకొన్నారు, తమకు అలౌకిక శక్తులున్నట్టు, అమోఘ మహిమలున్నట్టు కపట నటన చేశారు. అందువల్లనే వైజ్ఞానిక, సాంకేతిక శాస్త్రాల పురోగతి దేశదేశాలలో కొన్నివేల సంవత్సరాల పాటు స్తంభించిపోయింది. కొత్త సత్యాలను కొత్తవారు కనుగొనగలిగితే, తమ ఘనత ఎక్కడ దెబ్బతినగలదో అని, తాము పొందుతున్న గౌరవ మర్యాదలు ఎక్కడ తగ్గిపోగలవో అని "ఎందువల్ల?" అనే ప్రశ్న పైనే వీరు ఆంక్ష వేశారు.

దేశ దేశాలకు సంబంధించిన ఈ పూజారివర్గం వైఖరికి, ఈ పురోహితవర్గం వర్తనకు భిన్నమైనది కాదు మన ఋషుల నడవడి. "ఋషి" అనగానే అతడు "సర్వసంగ పరిత్యాగి" అని మనం భావిస్తాము. ఇది మన పౌరాణిక ఋషుల విషయంలోవలె మన వైదిక ఋషుల విషయంలో సయితం ఎంతమాత్రం నిజం కాదు. అంగిరసుడు, అగస్త్యుడు, భృగుడు, భరద్వాజుడు, వసిష్ఠుడు, విశ్వామిత్రుడు మొదలైనవారు వేదవేదాంగాలలోవలె పురాణేతిహాసాలలో మనకు తగులుతారు. ఇవి వంశ నామాలు కాబట్టి, వీరికి సంబంధించిన ఏ వృత్తాంతమైనా, ఏ విశేషమైనా ఒకే వ్యక్తికి సంబంధించింది కావడానికి వీలు లేదు. ఏమైనా, వీరి పుట్టుపూర్వోత్తరాలను గురించి మన పురాణాలలోగల కథలను పుణ్యగాథలుగా భావించే వారి మానసికస్వాస్థ్యాన్ని శంకించవలసి వుంటుంది. నా పలుకులు ఋషుల పట్ల ద్వేషంతో కూడినవి కావని రుజువు చేయడానికి వారికి సంబంధించి పురాణాలలోగల కొన్ని గాథలను (అయిష్టంగానే) ఇక్కడ పేర్కొనక తప్పదు.

అగస్త్యునికి, వసిష్ఠునికి తల్లి ఊర్వశి కాగా, తండ్రులు మిత్రవరుణులు. ఈ "జాయింట్" తండ్రులు ఊర్వశి ద్వారా తమ సుపుత్రద్వయాన్ని లోకోద్ధరణకై ఏ తీరున ప్రసాదించారో ఆ కథ అసహజమైనదేకాదు, అశ్లీలమైనది కూడా. ఇందుకు ఏమంత భిన్నమైనది కాదు ఘృతాచి తల్లిగా, భరద్వాజుడు తండ్రిగా ద్రోణాచార్యుని జననం. ఏవో మహిమలని, ఏవో వరాలని "మసిపూసి మారేడు కాయ" చేయడానికి ప్రయత్నం జరగకపోలేదు గాని, మత్స్యగంధితో పరాశరుడు జరిపినట్టిది పచ్చి వ్యభిచారం. ఈ వ్యభిచారం ద్వారా జన్మించిన వేదవ్యాసుడు వంశోద్ధరణ పేరుతో అంబిక, అంబాలికలతో

# సీతారాములు

పదేళ్ళనాడు మద్రాసులో నా "సీతజోస్యం" నాటకాన్ని నా మిత్రబృందానికి చదివి వినిపించిన తర్వాత ఒక పండిత మిత్రుడు చిరుకోపంతో చేసిన విమర్శ "ఈ సీత మా దృష్టిలోని సీత కా"దని. చిరునవ్వుతో ఆయనకు నేను చెప్పిన సమాధానం "ఈమె మీ దృష్టిలోని సీత కాకపోవచ్చు గాని, వాల్మీకి దృష్టిలోని సీత" అని. ఇప్పటికైనా నా పండితమిత్రుడు నాతో ఏకీభవించక పోవచ్చు. ఆయన వలె ఎందరెందరో ఏకీభవించక పోవచ్చు. అయినా, ఇదివరలో వలె ఇప్పటికీ – ఎప్పటికీ – నా నమ్మకం వాల్మీకి సీతనే యథాతథంగా నేను నా నాటకంలో ప్రవేశపెట్టానని.

వాల్మీకిని సరిగా చదవక, చదివినా సవ్యంగా అర్థం చేసుకొనలేక, పెక్కు మంది సంభావిస్తున్నట్టు, సీత నోట నాల్కలేని పతివ్రతా శిరోమణి కాదు. అవసరమైనప్పుడు భర్తతో ఆమె నిష్కర్షగా మాట్లాడేది, గత్యంతరం లేనప్పుడు పరుషంగానైనా మాట్లాడేది. అనువాదాలతో సరిపుచ్చుక, వాల్మీకి రామాయణం ఆరణ్యకాండలోని పదవసర్గను చదవండి. (అది ఈ పీఠిక చివర రెండవ అనుబంధంలో వున్నది). దాన్ని చదివితే "ఆయుధ మెక్కడ, ఆరణ్యవాస మెక్కడ" అని విభుని ఆమె సూటిగా ప్రశ్నించినట్టు తెలుస్తుంది. "శస్త్రములు చేపట్టుట వల్ల పాప బుద్ధిపుట్టును" అని ధవుని ఆమె గట్టిగా హెచ్చరించినట్లుగా తెలుస్తుంది. "పగ లేకనే యొక్కరిని జంపుట" మహాపాతకమని పెనిమిటితో ఆమె నిష్కర్షగా పలికినట్టు తెలుస్తుంది. పోతే, అయోధ్యాకాండలో 30వ సర్గను చదవండి. అరణ్యవాసానికి తనవెంట రావలదని భర్త గట్టిగా చెప్పినప్పుడు పట్టలేని కోపంతో తనతండ్రి మాటగా "నా అల్లుడు స్త్రీయే కాని పురుషుడు కాడు. పురుష వేషము దాల్చిన స్త్రీయై నన్ను వంచించెను!" అని పరుషంగా ఆమె పలుకుతుంది. కాగా, తన మాటగా మరింత పరుషమైన ధోరణిలో

"నన్ను నటునివలె బరులపాలు చేయగోరు చున్నావు!!" అని పలుకుతుంది. ఇంత పరుషంగా ఆమె నిష్కారణంగా పలకలేదు. అందుకు తగు కారణం వున్నది. దాన్ని మరికొంత దూరం పోయిన తర్వాత వివరిస్తాను.

సరే, "సీతా హాస్యాలు కూడా ఆడేదా?" అని మరొక సందేహం పెక్కు మందికి కలగవచ్చు. ఔను! ఆమెది హాస్యప్రవృత్తి, చతురతతో ఆమె హాస్యాలాడేది. అందరు వదినెలవలె మరిదితో ఆమె ఎక్కువగా హాస్యాలాడేది. ఇది నా ఊహ కాదు; వాల్మీకి రామాయణమే ఈ సంగతిని స్పష్టంగా చెబుతున్నది. సీతాపహరణం తర్వాత ఆమెను తలుచుకొని విలపిస్తూ "చెట్టుచాటున దాగి నన్ను వేళాకోళము పట్టించ గోరుచున్నావటే!" అని రాముడన్నట్టు ఆరణ్యకాండ 61వ సర్గ తెల్పుతున్నది. "ప్రియురాలా! నీవు పరియాచకము చేయు స్వభావము గలదానివని నే నెఱుగుదును" అని ఆయ నన్నట్టు 62వ సర్గ తెల్పుతున్నది. పంచవటి వద్ద ఒక శిలాఫలకాన్ని చూపిస్తూ "లక్ష్మణా! సీత మునుపు నాతోడ నీ రాతి మీద గూర్చుండి, నీ తోడ బెక్కు పరియాచకపు మాటలాడెను గదా!" అని రాముడన్నట్టు 63వ సర్గ తెల్పుతున్నది. కిష్కింధాకాండ ప్రథమసర్గ ఈ విషయాన్ని ధ్రువపరుస్తున్నది. అక్కడ తమ్మునితో "లక్ష్మణా! సీత చిఱునవ్వు మోముతో నడుమనడుమ బరిహాస పూర్వకము లయినవియు, తియ్యనివియు, రసవంతము లయినవియు, మేలొన గూర్చినవియు నైన పలుకులు పలుకు టెప్పుడు వినగలను?"అని రాముడంటాడు. సీత హాస్యోక్తు లాడేదనడానికి వీటిని మించి ఏమి సాక్ష్యాధారాలు కావాలి? ఈ సాక్ష్యాధారాల తర్వాత వాల్మీకి చిత్రణకు భిన్నంగా నేను సీతకు రూపకల్పన చేసినానంటే, అది సబబు కాగలదా?

లక్ష్మణునితో సీత పరియాచకాలాడుతూ వుండేదని రాముడు స్వయంగా పలికిన మీదట వదినె ముఖమైనా మరదికి తెలియదనడంకంటే "నాన్ సెన్స్" వుంటుందా? అయినా, కిష్కింధా కాండ 6వ సర్గలో ఇది వున్నది. రావణుడు తనను ఎత్తుకుపోతున్న ఘట్టంలో తన ఆభరణాలను ఉత్తరీయంలో మూటకట్టి, ఋశ్యమూక పర్వత శిఖరంపై తన మంత్రులు నలుగురితో కూర్చున్న సుగ్రీవుని సమీపంలో సీత పడవేస్తుంది. వాటిని సుగ్రీవుడు రామలక్ష్మణులకు చూపించినప్పుడు, లక్ష్మణుడు అన్నగారితో "ఆమె దొడుగు బాహుపురు లెట్టివో, కమ్మ లెట్టివో, నాకు తెలియదు, నే నెల్లప్పుడామె పాదములకు మ్రొక్కుటం జేసి, యామె కాలియందియెలుమాత్రమే నే నెఱుగుదును" అన్నాడట (కిష్కింధాకాండ, 6వ సర్గ). పది సంవత్సరాలకు పైగా అరణ్యవాసంలో నేమి, అంతకు ముందు అయోధ్యా నగరంలో నేమి పొరపాటుగా నైనా లక్ష్మణుడు వదినె ముఖాన్ని

# సీత జోస్యం

పా

త్ర

లు

**రాముడు**

కోసల దేశాధిపతి దశరథుని

జ్యేష్ఠపుత్రుడు

**సీత**

రాముని భార్య

**లక్ష్మణుడు**

రాముని తమ్ముడు

జనస్థానానికి చెందిన

ఇద్దరు ఋషులు

# ప్రథమాంకం

అది దండకారణ్యంలోని, జనస్థానంలో గల సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమంలో అతిథులకై ఉద్దేశించబడిన పర్ణశాల. ప్రేక్షకులకు ఎదురుగా కనిపించే మట్టి గోడలో దానికి ఒకే ఒక ద్వారం. లోనికి వచ్చేవారు వంగి రాకపోతే, ద్వారం తలకు తగులుతుంది. దానికి రెండు వైపుల వెదురు కడ్డీలతో రెండు కిటికీలు, పర్ణశాలలోకి వస్తూపోతూ వుండే వారు లోనికి రాకముందే ఆ కిటికీల గుండా కనబడుతూ వుంటారు. ఆశ్రమంలోని చెట్టుచేమలు కూడా అల్లంత దూరాన వున్నట్టు ద్వారబంధం గుండా, గవాక్షాల గుండా కనిపిస్తూ వుంటాయి.

పర్ణశాలలో పక్కగోడ చెంత, ఒక నులక మంచం ఎత్తిపెట్టి వుంటుంది. దాని ప్రక్క ఒక బల్లపై రాసిగా పేర్చిన కందమూల ఫలాలు. మరొక బల్లపై మంచినీళ్ళ కుండ; దాని సరసనే రెండు రాగి పంచపాత్రలు. పర్ణశాల మధ్యభాగంలో కృష్ణాజినాలతో కప్పబడిన అయిదారు ఉన్నతాసనాలు.

తెర లేచినప్పుడు ఒక అజినాసనంపై కూర్చుని, ఎదురుగా వున్న మరొక దానిపై విప్పి పెట్టివున్న తన నగల మూటలో నుంచి వాటిని పైకితీసి, ఏవేవో జ్ఞాపకాలు పెల్లుబికి వస్తున్నట్టు, సీత వాటివంక చూస్తూపోతూ వుంటుంది. వన్నె తగ్గిన నగలకు వాటి గుడ్డమూట చెంగుతో మెరుగుపెడుతూ వుంటుంది.

సీత వయస్సు పదహారు, పదిహేడు సంవత్సరాలు. ఒక సాదా పట్టుచీర కట్టుకొన్నా, చెవులకు కమ్మలు, మెడలో ఒక హారం, వేలిని ఒక వుంగరం తప్ప వేరే నగలు లేకపోయినా, ఇతర అలంకరణలు సయితం లేకపోయినా, చూడగానే చూపులను ఆకట్టుకొనగల అంద చందాలు. క్షణానికొక భావవిలసనాన్ని ప్రతిఫలించగల విశాల నేత్రాలు; చక్కగా శ్రుతి చేసిన వీణ వలె పలకగల కంఠస్వరం.

తెర లేచిన కాసేపటికి లక్ష్మణుడు ప్రవేశిస్తాడు. అతని వయసు కూడా పదహారు, పదిహేడు సంవత్సరాల ప్రాంతాల. మంచి పొడగరి, వెడల్పు నుదురు, పెద్ద కళ్ళు, తీర్చి దిద్దినట్టుగా వున్న ముక్కు, బలమైన క్రింది దవడ, కండలు తిరిగిన రెక్కలు, నారపంచె, నారతోనే నేసిన ఉత్తరీయం, ధనుస్సును, తూణీరాన్ని భుజాల నుంచి తొలగిస్తూ గడప దాటతాడు.

ఈ రంగంలో ప్రవేశించే ఋషులిద్దరిలో మొదటి ఋషి వయస్సు అరవై పైగా; రెండవ ఋషి ఆయనకంటె పదేళ్ళు చిన్న. మొదటి ఋషి పొట్టి; రెండవ ఋషి పొడగరి. ఒకరిది బవిరి గడ్డం. మరొకరిది మేక గడ్డం. ఇద్దరివీ నారబట్టలే. మొదటి ఋషి చేతులలో దండ కమండలాలు; రెండవ ఋషి చేతులలో ఒక పళ్ళబుట్ట.

కాలి అలికిడి విని తల యెత్తిన సీతకు కిటికీని దాటుతూ లక్ష్మణుడు కనబడతాడు.

**సీత** : (మరది లోపలికి రాగానే అల్లరితో కూడిన చిరునవ్వుతో) తా మొక్కరే దయచేస్తున్నారు; తమ ఇనవంశోద్భవ ప్రభువులెక్కడ?

**లక్ష్మణుడు** : ఏం! తమది కూడా ఇనవంశమే కాదా?

**సీత** : అయితే మాత్రమేం? మా వంశీకులు అఖిల జగత్తును పదే పదే జయిస్తూ పోయారా? అశ్వమేధాలను పదే పదే చేస్తూ పోయారా? వారు సాగరాన్ని తవ్వారా? పాతాళాన్ని చేరారా? స్వర్గం నుంచి గంగను భూతలానికి దించుకు వచ్చారా? మీవారితో మావారికి పోలి కెక్కడలే!

**లక్ష్మణుడు** : ముల్లోకాలలో జైత్రయాత్రలకు సంబంధించినంత వరకు ఆమాట నిజమైనా...

**సీత** : (వెక్కిరింపుగా) "ఆ మాట నిజమైనా!"

**లక్ష్మణుడు** : కాదా, వదినా?

**సీత** : వందిమాగధులు మీకే కాదు; మాకూ వున్నారు!

**లక్ష్మణుడు** : ఔను మీకూ వున్నారు – వుంటే?

**సీత** : ఆం! ఏమీ లేదు! వారి స్తోత్రపాఠాలను స్తోత్రపాఠాలుగానే మేమూ పరిగణిస్తాము గాని, అవి పరమ సత్యాలన్న పిచ్చి భ్రమలకు పోము!

**లక్ష్మణుడు** : పిచ్చిభ్రమ లేమిటి, వదినా? దేవేంద్రుడు రాక్షసరూపంలో వచ్చి, మా సగర చక్రవర్తి యాగాశ్వాన్ని దొంగిలించి, పాతాళంలో దాన్ని కట్టివేయగా.....

**సీత** : ఆయన దాన్ని తిరిగి తెప్పించాడు! అరవై వేల మంది కొడుకులను కన్న తండ్రికి ఏదైనా సాధ్యమే!

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Seeta+Josyam**

* * *